పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 305 పేజీలు - 08 వెల - 05/-

ఆదివారం 01-11-2026

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం!

ఓటర్లు ఎలాంటి భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఈసీ పిలుపు

- ఆంధ్రప్రదేశ్‌లో పుర, నగర పాలక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- 36,351 మంది పోలీసులతో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బందోబస్తు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు లేదా వెబ్‌కాస్టింగ్
- దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు

ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక, నగర పాలక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ పునేఠా వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కెమెరాల నిఘా పరిధిలోకి తీసుకొచ్చామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశంలో పూర్తి వివరాలు అందించారు.

36 వేల మంది పోలీసులతో పటిష్ఠ భద్రత

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా స్థానిక ఎన్నికల కోసం 36,351 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, నార్మల్‌గా వర్గీకరించారు. హైపర్ సెన్సిటివ్ కేంద్రాల్లో 1:4 (ఒక అధికారి, నలుగురు సిబ్బంది), సెన్సిటివ్ కేంద్రాల్లో 1:3 పద్ధతిలో భద్రత కల్పిస్తున్నారు.

మిగతా 2లో

ఏపీకి ఎస్‌బీఐ ఆపన్నహస్తం..

రూ. 5 కోట్ల భారీ విరాళం

- అర్నబ్ తుపాను బాధితుల కోసం ఎస్‌బీఐ భారీ విరాళం
- ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 5.01 కోట్లు అందజేత
- సీఎం చంద్రబాబుకు చెక్ అందించిన ఎస్‌బీఐ ప్రతినిధులు
- విరాళంపై ఎస్‌బీఐకి కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి



అర్నబ్ తుపాను కారణంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకునేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలకు తమ వంతు మద్దతుగా ముఖ్యమంత్రి సహాయ నిధికి

మిగతాది 2లో

సీఈసీపై ఇండియా కూటమి

'ప్రజా అభిశంసన'..

- 13.3 కోట్ల ఓట్లను జాబితా నుంచి తొలగించారని రాహుల్ గాంధీ ఆరోపణ
- 2024 లోక్‌సభ ఎన్నికలు చట్టవిరుద్ధమని, బీజేపీ గెలుపు అక్రమమని వ్యాఖ్య
- ప్రభుత్వం దేశ ఆత్మపై దాడి చేస్తోందని మల్లికార్జున ఖర్గే విమర్శ

2024 లోక్‌సభ ఎన్నికల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. భారీ ఎత్తున ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేశారని,

ఒమర్ అబ్దుల్లాకు సొంత పార్టీలో షాక్..

- నేషనల్ కాన్ఫరెన్స్‌లో రాజుకున్న అంతర్గత విభేదాలు
- సీఎం ఒమర్ అబ్దుల్లా నాయకత్వంపై అసమ్మతి గళం విప్పిన ఎమ్మెల్యేలు
- మంత్రివర్గ విస్తరణపై అసంతృప్తి.. పునర్వ్యవస్థీకరణకు డిమాండ్

జమ్మూకశ్మీర్‌లో అధికార నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) పార్టీలో తీవ్ర సంక్షోభం

స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు దుర్మార్గాలు చేస్తున్నారు: పేర్ని నాని

- మున్సిపల్ ఎన్నికల వేళ అధికార కూటమిపై పేర్ని నాని విమర్శలు
- తప్పుడు మార్గాల్లో ఏకగ్రీవాలు చేసుకుంటున్నారని మండిపాటు
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శ

రేపు మున్సిపల్ ఎన్నికలు జరగనున్న వేళ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార, విపక్షాల మధ్య

రాష్ట్రంలో జంగిల్ రాజ్

నడుస్తోంది..

- రాప్తాడు పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై కిరాతక దాడి
- టీడీపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయన్న మాజీ సీఎం జగన్
- ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి, నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హామీ
- బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- ఘటనపై విస్తృత దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు

ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన కిరాతక దాడి ఘటన, టీడీపీ కూటమి పాలనలో నెలకొన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోందని ఆయన అన్నారు.

మిగతాది 2లో

రాప్తాడు బాలిక పై దాడి ఘటనపై లోకేశ్ తీవ్ర ఆవేదన

ధర్మవరం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- రాప్తాడులో బాలికపై దాడిని తీవ్రంగా ఖండించిన మంత్రి లోకేశ్
- ఆడపిల్లల భద్రతకు భంగం కలిగిస్తే ఉక్కుపాదంతో అణిచేస్తామని హెచ్చరిక
- పాఠశాల తరగతి గదిలో విద్యార్థినిపై రంపంతో దాడి చేసిన ఉన్మాది

అనంతపురం జిల్లా రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అమానుష దాడిపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, గుండె బరువెక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. "చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో చూశాక కన్నీళ్లు ఆగడం లేదు. ఉన్మాది ఘాతుకం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది," అని ఆయన అన్నారు.

మిగతాది 2లో

ఎల్‌నినో ఎఫెక్ట్..

తాగునీటి కోసం రూ.120 కోట్లు..

- ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు
- నాలుగు జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయానికి రూ.120 కోట్లు
- ఇతర జిల్లాలకు ఒక్కోటి రూ.కోటి చొప్పున నిధులు
- బోరుబావులు, ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఏర్పాట్లు

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో

మిగతాది 2లో

ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం...

ఫ్యాక్టరీలో నలుగురు సజీవ దహనం

- ఢిల్లీలోని మంగోల్పురిలో ఘటన
- చెప్పుల ఫ్యాక్టరీలో చెలరేగిన మంటల్లో నలుగురు మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఆరుగురిని కాపాడిన సిబ్బంది
- రబ్బరు కారణంగా మంటలు వేగంగా వ్యాపించాయని అంచనా

దేశ రాజధాని ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంగోల్‌పురి ప్రాంతంలోని ఒక ఫ్యాక్టరీలో రాత్రి చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

రాప్తాడు బాలికపై దాడి ఘటనపై లోకేశ్ తీవ్ర ఆవేదన

గుండె బరువెక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. “చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో చూశాక కన్నీళ్లు ఆగడం లేదు. ఉన్మాది ఘాతుకం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది,” అని ఆయన అన్నారు. ఆడపిల్లలు, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని, ఉన్మాదులను ఉక్కుపాదంతో అణిచివేస్తామని లోకేశ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. మహిళల వైపు కన్నెత్తి చూడాలంటేనే భయపడే వాతావరణం సృష్టిస్తామని ఆయన స్పష్టం చేశారు. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించేవారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసలేం జరిగిందంటే..

రాప్తాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి నేరుగా పదో తరగతి గదిలోకి ప్రవేశించి, అక్కడ ఉన్న విద్యార్థినిపై చెట్ల కొమ్మలు నరికే రంపంతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినిపై కూడా దుండగుడు దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనతో పాఠశాలలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ఉపాధ్యాయులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో నిందితుడు

ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. ధర్మవరం వైపు పారిపోతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ధర్మవరం మండలానికి చెందిన యువకుడిగా గుర్తించారు. బాధితురాలికి అతను దగ్గరి బంధువేనని స్థానికులు చెబుతున్నారు. వ్యక్తిగత కక్షల కారణంగానే ఈ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత అమానుషమైన చర్య అని పేర్కొన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, ఆమె ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా ఈ ఘటనపై స్పందించి, బాలికకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

(ఒక అధికారి, నలుగురు సిబ్బంది), సెన్సిటివ్ కేంద్రాల్లో 1o3 పద్ధతిలో భద్రత కల్పిస్తున్నారు.

బ్యాలెట్ బాక్సుల తరలింపు, భద్రత కోసం 1,543 రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించేందుకు డీఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను అందుబాటులో ఉంచారు. పల్నాడు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ఏపీ స్పెషల్ పోలీస్‌కు చెందిన 130 ప్లటూన్లను మోహరించారు. డీజీపీ కార్యాలయం నుంచి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, క్విక్ రియాక్షన్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయని పునేఠా వివరించారు.

సుప్రీం ఆదేశాలతో సంపూర్ణ నిఘా

ఎన్నికల ప్రక్రియపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇప్పటికే 6,600 పోలింగ్ లొకేషన్లలో 12,000 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5,500 సమస్యాత్మక (సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్) కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

కెమెరాలు లేని చోట్ల వీడియోగ్రఫీ, అది కూడా సాధ్యం కాని మారుమూల ప్రాంతాల్లో ల్యాప్‌టాప్‌ల ద్వారా వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట జరిగే ప్రతి

కదలికను రికార్డు చేస్తామని అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాలు చివరి నిమిషంలో వచ్చినా, సాధ్యమైనంత వరకు అన్ని కేంద్రాలను నిఘా పరిధిలోకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని పునేఠా పేర్కొన్నారు.

బరిలో 9,642 మంది అభ్యర్థులు.. 75 వేల సిబ్బంది రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లు, 70 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కార్పొరేషన్ మేయర్/చైర్‌పర్సన్ పదవులకు 153 మంది, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు 367 మంది పోటీలో ఉన్నారు. కార్పొరేషన్లలోని 922 వార్డులకు 3,773 మంది, మున్సిపాలిటీల్లోని 2,382 వార్డులకు 6,669 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

మొత్తం మీద వార్డు పదవుల కోసం 9,642 మంది పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. పోలింగ్ సిబ్బంది ఇప్పటికే డిస్పాచ్ కేంద్రాల నుంచి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం వివరాలను మీడియాకు వెల్లడిస్తామని ఎస్ఈసీ తెలిపింది.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి

పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచాల్సిన అవసరం ఉందని ఎస్ఈసీ అనిల్ పునేఠా అభిప్రాయపడ్డారు. ఓటర్లలో చైతన్యం పెంచేందుకు మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు.

కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపాలిటీలు (పిడుగురాళ్ల, గుడిజాల, దాచేపల్లి, దార్సి, పలమనేరు, ప్రొద్దుటూరు, రాయచోటి, కమలాపురం) ఏకగ్రీవం అయినందున అక్కడ ఎన్నికలు జరగడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎక్కువ కాలం అమల్లో ఉంటే అభివృద్ధి పనులు కుంటుపడతాయని, అందుకే ఈ ప్రక్రియను త్వరగా ముగించడం అందరికీ శ్రేయస్కరమని పునేఠా పేర్కొన్నారు.

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది.. రాప్తాడు ఘటనే నిదర్శనం: జగన్

జరిగిన కిరాతక దాడి ఘటన, టీడీపీ కూటమి పాలనలో నెలకొన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

“రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తరగతి గదిలోనే ఒక విద్యార్థినిపై రంపంతో జరిగిన కిరాతక దాడి.. టీడీపీ కూటమి పాలనలో శాంతిభద్రతలు ఎంతగా విఫలమయ్యాయో స్పష్టం చేస్తోంది. ఒక ప్రభుత్వ పాఠశాలలోకి దుండగుడు స్వేచ్ఛగా ఎలా ప్రవేశించి, ఒక బాలికపై ఇంత దారుణంగా దాడి చేయగలిగాడు? విద్యాసంస్థల్లో కూడా పిల్లలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది” అని జగన్ పేర్కొన్నారు. బాధితురాలిని కాపాడే ప్రయత్నంలో మరో విద్యార్థిని కూడా గాయపడటం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం పాలనను పక్కనపెట్టి, రాజకీయ కక్ష సాధింపులు, ‘రెడ్ బుక్’ పాలనకే ప్రాధాన్యం ఇస్తోందని, దీనివల్లే నేరస్థులు చట్టమంటే భయం లేకుండా రెచ్చిపోతున్నారని జగన్ ఆరోపించారు. గాయపడిన విద్యార్థినులకు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ధైర్యం చెప్పాలని డిమాండ్ చేశారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి, పారదర్శక విచారణ ద్వారా కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై తక్షణమే సమీక్ష జరపాలని, ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ పూర్తి బాధ్యత వహించాలని జగన్ అన్నారు.

ఘటన వివరాలు, ప్రభుత్వ స్పందన

రాప్తాడులోని ఓ పాఠశాలలో శనివారం ఓ దుండగుడు తరగతి గదిలోకి ప్రవేశించి పదో తరగతి విద్యార్థినిపై ఎలోక్ట్రిక్ రంపంతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో విద్యార్థిని ముఖం, తల, గొంతు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుడి చేయి దాదాపు తెగిపోయినట్లు సమాచారం. ఆమెను కాపాడబోయిన మరో విద్యార్థిని కూడా తీవ్రంగా గాయపడింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో, వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

మరోవైపు, ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె కోలుకునే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని, అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్య బృందాన్ని ఆదేశించానని తెలిపారు. “ఈ ఘాతుకానికి పాల్పడిన మృగాడిని పట్టుకుని, చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీసులను ఆదేశించాను” అని చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతరం ఆయన బాధితురాలి తల్లితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి కూడా ఆయన ఆరా తీశారు. ఈ ఘటనను నారా లోకేశ్ కూడా తీవ్రంగా ఖండించారు.

ఈ ఘటనపై పోలీసులు విస్తృత స్థాయి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని గుర్తించి, అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎల్‌నినో ఎఫెక్ట్..

తాగునీటి కోసం రూ.120 కోట్లు..

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు ఆమోదించినట్లు తెలిపారు.

రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సీతక్క సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఉన్న ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి నీరు చేరేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఒమర్ అబ్దుల్లాకు సొంత పార్టీలో షాక్..

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలో తీవ్ర సంక్షోభం తలెత్తింది. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నాయకత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే తిరుగుబాటు జెండా ఎగరేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణపై తీవ్ర అసంతృప్తితో ఉన్న సుమారు 19 మంది ఎమ్మెల్యేలు ఏకమై, పార్టీ అధిష్ఠానానికి 15 రోజుల గడువు విధించారు. శ్రీనగర్‌లోని ఎమ్మెల్యే కైజర్ జంషెడ్ లోనీ నివాసంలో అసమ్మతి ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలని, రెండేళ్లు పూర్తి చేసుకున్న మంత్రులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఓ తీర్మానాన్ని ఆమోదించారు. సీఎం ఒమర్ అబ్దుల్లాకు సలహాదారుగా ఉన్న నసీర్ అస్లాం వానీతో పాటు మరికొందరిని పదవుల నుంచి తప్పించాలని వారు స్పష్టం చేశారు. అక్టోబర్ 27న జరిగిన మంత్రివర్గ విస్తరణలో నలుగురు కొత్త మంత్రులను నియమించారు. ఈ క్రమంలో ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్న తమలాంటి సీనియర్లను విస్మరించారని అసమ్మతి నేతలు ఆరోపిస్తున్నారు. పార్టీలో కొందరికే ప్రాధాన్యత ఇస్తూ, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది పార్టీని బలోపేతం చేసే ప్రయత్నమే తప్ప, తిరుగుబాటు కాదని ఓ సీనియర్ నేత పేర్కొన్నారు. ఈ తీర్మానాన్ని త్వరలోనే పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాకు సమర్పించనున్నట్లు అసమ్మతి వర్గం తెలిపింది. ఈ పరిణామంతో ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం తీవ్ర రాజకీయ ఒత్తిడిలో పడింది.

ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం...

(మొదటి పేజీ తరువాయి)

వివరాల్లోకి వెళ్తే.. ఒక పాదరక్షల తయారీ పరిశ్రమ బేస్‌మెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది 20 ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఫ్యాక్టరీలో చిక్కుకున్న మరో ఆరుగురిని రెస్క్యూ టీమ్ సురక్షితంగా బయటకు తీసుకువచ్చింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఫ్యాక్టరీలో పాదరక్షల తయారీకి వినియోగించే రబ్బరు నిల్వలు భారీగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయని అధికారులు భావిస్తున్నారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఏపీకి ఎస్‌బీఐ ఆపన్నహస్తం..

రూ. 5 కోట్ల భారీ విరాళం

(మొదటి పేజీ తరువాయి)

సహాయ నిధికి రూ. 5 కోట్ల 1 లక్ష రూపాయల భారీ విరాళాన్ని అందించింది. నేడు అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎస్‌బీఐ ప్రతినిధి బృందం కలిసింది. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ అమర రామ్మోహన్ రావు విరాళానికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రికి అందజేశారు. తుపాను బాధితులను ఆదుకునేందుకు ఉదారంగా స్పందించి, భారీ విరాళం అందించినందుకు ఎస్‌బీఐ యాజమాన్యానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ సీజీఎం సుశీల్ కుమార్, జీఎం కుందన్ జ్యోతి, ఏజీఎం షేక్ షమీన్ భాను తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు దుర్మార్గాలు చేస్తున్నారు: పేర్ని నాని

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని అధికార కూటమి దుర్మార్గాలకు పాల్పడుతోందని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్ర ఆరోపణలు చేశారు. మచిలీపట్నంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... తప్పుడు మార్గాల్లో ఏకగ్రీవాలు సాధించి, కూటమి బలంగా ఉందని చూపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. “రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. చంద్రబాబే అన్నీ గెలిచారని బిల్డప్ ఇచ్చుకోవడం కోసమే ఈ దుర్మార్గాలు చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు” అని పేర్ని నాని మండిపడ్డారు. బీసీ కుల గణన చేపట్టకుండా, ఓట్లు తక్కువగా ఉన్నాయని చూపిస్తూ రిజర్వేషన్లలో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పలు మండలాల్లో దళితులకు ఎంపీపీ సీట్లు రిజర్వ్ చేయలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో పేర్ని నాని వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని వైసీపీ నేతలు అధికార పార్టీపై ఆరోపణలు చేస్తున్నారు. మరోవైపు, వైసీపీ నేతలే హింసను ప్రేరేపిస్తున్నారని టీడీపీ ఎదురుదాడి చేస్తోంది. ఇదిలా ఉండగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

సీఈసీపై ఇండియా కూటమి ‘ప్రజా అభిశంసన’..

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియనే అపహాస్యం చేశారని, బీజేపీ ఎంపీలు అక్రమంగా లోక్‌సభలో అడుగుపెట్టారని ఆయన

ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ‘ఇండియా’ కూటమి శనివారం నిర్వహించిన ‘ప్రజా అభిశంసన’ కార్యక్రమంలో రాహుల్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఏర్పాటు చేసిన ఈ మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, “దేశవ్యాప్తంగా సుమారు 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారు. ఇది మొత్తం ఓటర్లలో దాదాపు 15 శాతానికి సమానం. అనేక నియోజకవర్గాల్లో గెలుపు మార్జిన్ కేవలం 3 శాతం మాత్రమే ఉన్నప్పుడు, ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించడం ఎన్నికల నిష్పాక్షికతపై తీవ్రమైన సందేహాలు రేకెత్తిస్తోంది” అని అన్నారు. “2024 లోక్‌సభ ఎన్నికలు చట్టవిరుద్ధంగా జరిగాయని, బీజేపీ సభ్యులు అక్రమంగా పార్లమెంటులోకి ప్రవేశించారని స్వయంగా ఎన్నికల సంఘమే పరోక్షంగా అంగీకరిస్తోంది” అని రాహుల్ వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్న నాయకత్వం తనను కాపాడుతుందని సీఈసీ భావిస్తే పొరపాటని, ప్రజల ఆగ్రహాన్ని గమనించాలని హెచ్చరించారు. “మీరు ఓట్ల దొంగతనానికి సహకరిస్తూనే ఉండండి. కానీ వీధుల్లో ఉన్న ప్రజలు మీరు వారికి చేసిన ద్రోహాన్ని ఎప్పటికీ మర్చిపోరని నేను హామీ ఇస్తున్నాను” అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించారు. సీఈసీకి వ్యతిరేకంగా లాంఛనప్రాయ ప్రజా అభిశంసనను ఖర్గే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశ ఆత్మపైనే దాడి చేస్తోందని, పార్లమెంటులో మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు కనీస అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా తమ నిరసనను తెలియజేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఇండియా కూటమి నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 19 రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ప్రచారాలకే దిక్కులేదు ప్రశాంతంగా ఓటింగ్ అంట!

దొర్నిపాడుఅక్టోబర్ 31 పల్లె వెలుగు న్యూస్ ప్రతి ఓటరు వారి ఓటుహక్కును వినియోగించుకోవాలని ఉంటుంది ,కానీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు వారి వారికి

కేటాయించిన గుర్తులు చూపుతూ గ్రామాల్లో ప్రచారాలు కొనసాగిస్తే ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకొని ఓట్లు వేస్తారు ,అభ్యర్థులు ప్రచారాలు చేసుకోవడానికే దిక్కు లేకుంటే ఎవరు ఏ పార్టీ అభ్యర్థి వారిగుర్తులుఏమిటిఅనితెలియకుండా ప్రజ లుఓట్లు ఏ విధంగా వేస్తారో వేచి చూడాల్సిందే అంటున్నారుప్రజలు, అన్ని శాఖల అధికారులు మాత్రం ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం మీ ఓటు ప్రశాంతవాతావరణం లో సరైన అభ్యర్థికి ఓట్లు వేసుకోండి అంటూ పత్రికల్లో, టీవీల్లో మీడియాలలో పత్రికల సమావేశంలోప్రకటనలుఇస్తున్నారు,అభ్యర్థులువారికి కేటాయించినగుర్తులు చూపుతూ ప్రచారాలుచేస్తారా, ఎన్నికలు జరిగే నవేసి చూడాల్సిందే మరి ప్రజాస్వామ్యం బ్రతికి ఓట్లు ప్రశాంతంగా జరగాలంటే అధికారులకు పూర్తి స్వేచ్ఛ వారి విధులకు ఆటంకాలు చేయకుంటే ప్రజాస్వామ్యాన్ని బ్రతికించి కాపాడుతారు అనుకుంటున్నారుప్రజలు, దొర్నిపాడుమండలంలో ఇప్పటివరకు టిడిపి పార్టీ మినహా ఏ పార్టీ కూడా ప్రచారాలు చేసిన దాఖలు కనిపించలేదు ఎందుకో మరి

ఘనముగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతి.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా

శ్రద్ధాంజలి ఘటించి ఆమె చిత్ర పటానికి పూలమాల నివాళులర్పించారు. ఈ సందర్భంగా నంద్యాల టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉకోటు వాసు మాట్లాడుతూ ఆమె భారత దేశంనాకు స్వతంత్ర ఉద్యమం లో వారి తండ్రి అయిన మొదటి ప్రధాని మంత్రి జవహర్ లాల్ నెహ్రూ వెంట నాడు జైలు శిక్ష అనుభవం ఉంచి స్వతంత్ర ము సంపాదించి ప్రధాని గా 17 సంవత్సరాలుగా ప్రధాని చేసి 20 సూత్రాల పదానికి అమలు చేసి ఉక్కు మహిళా గా 1984సవచారం వారి అంగరక్షకులు వారిని తుపాకులతో కాల్చారని అని తెలిపారు . ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, మాజీ అధికార ప్రతినిధి ఉకోటు, వాసు, రత్నమయ్య, చిన్న కేశాలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొణిదేడులో టీడీపీ ఎన్నికల ప్రచారానికి ప్రజాదరణ..

పాణ్యం అక్టోబర్ 31 పల్లె వెలుగు : మండలంలోని కొణిదేడు గ్రామంలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి నంద్యాల రవికుమార్, స్థానిక ఎంపీటీసీ అభ్యర్థితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి తమకు మద్దతుగా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో గ్రామ ప్రజలు వారికి ఆప్యాయంగా స్వాగతం పలుకుతూ ఆదరణ చూపించారు. ప్రచారంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్..!
ప్రయాణికుల అవస్థలు

మహానంది, పల్లె వెలుగు నంద్యాల -గిద్దలూరు రహదారి నల్లమల్ల రోడ్డులో ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయ సమీపంలోని రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలను నిలిపివేశారు. దీంతో నంద్యాల- గిద్దలూరు వెళ్లే వాహనాల రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికులు అవస్థలు పడ్డారు. రోడ్డు విభాగం సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ప్రయాణికులే ట్రాఫిక్‌ను క్లియర్ చేసుకున్నారు

ఎన్నికల వేళ కరెన్సీ కట్టల గుట్టలు!

● కర్నూలులో రూ.76 లక్షల గుట్టురట్టు ● వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అనుచరుడి ఇంట్లోనే దాచిన వైనం ● రాత్రికి రాత్రే దాడి చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్.. ఐటీకి భారీ ముడుపులు అప్పగింత

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో మున్సిపల్ ఎన్నికల వేళ ఓటర్లకు ఎరవేయడానికి సిద్ధం చేసిన కరెన్సీ నోట్ల గుట్టలు బట్టబయలయ్యాయి. కర్నూలు నగరం నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో నిఘా అధికారుల పిడుగుపాటు దాడితో ఏకంగా రూ. 76,07,400 (డెబ్బై ఆరు లక్షల ఏడు వేల నాలుగు వందల రూపాయలు) లెక్కాపత్రం లేని నల్లధనం వెలుగుచూసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఇంత భారీ స్థాయిలో ఒకేచోట నగదు పట్టుబడటం నగర రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది.

పక్కా స్కెచ్.. అర్ధరాత్రి ఆపరేషన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా అందిన కచ్చితమైన ముందస్తు సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. కర్నూలు డీఎస్పీ కేపీ రాఘవేంద్ర పర్యవేక్షణలో 3వ పట్టణ సీఐ పి. శేషయ్య, ఎస్సైలు షామీర్ బాషా, ఎం. చంద్రశేఖర్ రెడ్డి, కే. గోపినాథ్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్-ఛార్జ్ బి. రాంబాబు బృందం మెరుపు వేగంతో విరుచుకుపడింది. శుక్రవారం రాత్రి 7:15 గంటల సమయంలో నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని డోర్

నెం. 87-1277-1 నివాసంపై ఆకస్మిక దాడి చేశారు. అభ్యర్థి స్నేహితుడే లక్ష్యం: సదరు నివాసం కర్నూలు 27వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి బెల్లం మహేశ్వర రెడ్డికి అత్యంత సన్నిహితుడైన డాక్టర్ కే. అమర్నాథ్ రెడ్డి (46)దిగా అధికారులు తేల్చారు. ఇంట్లో జరిపిన అణువణువు తనిఖీల్లో బ్యాగుల్లో భద్రపరిచిన రూ. 76.07 లక్షల నగదు కట్టలు చూసి అధికారులే నివ్వెరపోయారు. ఆ సొమ్ము ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరి కోసం నిల్వ ఉంచారన్న ప్రశ్నలకు ఇంట్లోని వారి వద్ద ఎలాంటి సమాధానం గానీ, బ్యాంకు పత్రాలు గానీ లేకపోవడంతో అధికారులు వెంటనే ఆ మొత్తాన్ని జప్తు చేశారు.

ఐటీ శాఖకు నగదు.. నిఘా తీవ్రతరం: స్వాధీనం చేసుకున్న రూ. 76 లక్షలకు పైగా నగదును తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులకు అప్పగించారు. ఈ డబ్బు వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? ఎన్నికల్లో ఓట్లను కొనుగోలు చేసేందుకే తెచ్చారా? అనే కోణాల్లో అధికారులు ఆరా తీస్తున్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రలోభాలతో కలుషితం చేయాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, అక్రమ మద్యం, డబ్బు పంపిణీపై ఉక్కుపాదం మోపుతామని అధికారులు హెచ్చరించారు. ఇంకా ఎవరైనా అనుమానాస్పద లావాదేవీలకు పాల్పడితే తీవ్ర పరిణామాలుంటాయని తేల్చిచెప్పారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్.

● ప్రతి ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ● జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 1 నగర పంచాయతీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం . ● ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్. ● 403 పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు పూర్తి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 1 నగర పంచాయతీ పరిధిలో రేపు1వ తేదీన మున్సిపల్ ఎన్నికలను ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు.

శనివారం నంద్యాల లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని (డిస్ట్రిబ్యూషన్ సెంటర్) జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ సిబ్బందికి కల్పించిన సౌకర్యాలు, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

నంద్యాల జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 1 నగర పంచాయతీ పరిధిలో పరిధిలో మొత్తం 403 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో సాధారణ, సున్నిత, అత్యంత సున్నిత కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వెబ్‌కాస్టింగ్ సదుపాయాలు, మైక్రో అబ్జర్వర్ల నియామకం, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా షేడ్స్, త్రాగునీరు, మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులకు క్యూ లైన్‌లో ప్రాధాన్యతనిస్తూ త్వరగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, భద్రతా సిబ్బందికి తెలిపారు.

ఎన్నికల నియమావళి ఆంక్షలు

పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలు ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదు అని తెలిపారు. 100 మీటర్ల పరిధికి వెలుపల మాత్రమే ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఓటర్లకు సహాయం చేయవచ్చు అని అన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం 48 గంటల నిషేధ కాలంలో మద్యం విక్రయాలను నిలిపేయడం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పాటు కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వడం జరిగిందన్నారు.

ఎన్నికల ప్రచార గడువు ముగిసిన నేపథ్యంలో, నియోజకవర్గానికి సంబంధం లేని బయటి వ్యక్తులు వెంటనే తమ స్వస్థలాలకు వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేలా చూడాలన్నారు.

పాణ్యం మండలంలో హోరెత్తుతున్న టీడీపీ ఎన్నికల ప్రచారం..

ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థుల విజ్ఞప్తి..

పాణ్యం అక్టోబర్ 31 పల్లె వెలుగు : మండలంలో టీడీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎన్నికల

ప్రచారం జోరుగా సాగుతోంది. మండల జడ్పీటీసీ అభ్యర్థి నంద్యాల రవికుమార్‌తో పాటు పాణ్యం,కొణిదేడు, ఆలమూరు ఎంపీటీసీ అభ్యర్థులు సంయుక్తంగా గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి వీధి,ప్రతి ఇంటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మహిళా ఎంపీటీసీ అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. గతంలో రూ. 2,000గా ఉన్న వృద్ధాప్య పింఛన్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 4,000కు పెంచిందని, వికలాంగులకు రూ. 6,000, కిడ్నీ, లివర్ తదితర తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి రూ. 10,000 పింఛన్ అందిస్తోందని తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తూ వృద్ధులకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి నాయకత్వంలో పాణ్యం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని అభ్యర్థులు తెలిపారు. మండల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అనుభవజ్ఞులైన నాయకులతో పాటు మహిళా అభ్యర్థులను కూడా ఆదరించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలను కోరుతున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పాలెం చంద్రారెడ్డి, ఖాదర్ బాషా,లాయర్ బాబు,మాజీ జెడ్పిటిసి నారాయణమ్మ, రాంపుల్లా రెడ్డి,రామ గోవింద్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, దేవదానం,సురేష్ టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో భయం ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా

ఓటు హక్కు వినియోగించుకోండి.

జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లాలో నంద్యాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వారు ఓటు వేసే అవసరం కోసం మాత్రమే నిబంధనల ప్రకారం లోపలికి వెళ్లేందుకు అనుమతి

రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.

ఈరోజు నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని పోలీసు బలగాలతో సమీక్ష నిర్వహించి, ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం జిల్లాలోని హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, నార్మల్ పోలింగ్ కేంద్రాలకు తగిన స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల భద్రతలో భాగంగా సీఐ స్ట్రైకింగ్ ఫోర్స్, ఎస్ఐ స్ట్రైకింగ్ ఫోర్స్‌తో పాటు రిజర్వ్ ఫోర్స్‌గా ఏపీఎస్పీ ప్లాటూన్లను కూడా అందుబాటులో ఉంచారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, విధి నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలపై ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించడం జరిగింది.

నుంచి పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో బయలుదేరుతున్నారు. రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, ముఖ్యంగా నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లకు పోలీసు శాఖ తరఫున విజ్ఞప్తి చేస్తూ, ప్రతి ఒక్కరూ ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎలాంటి ఎన్నికల ప్రచారం లేదా ఓటర్లను ప్రభావితం చేసే విధమైన కార్యకలాపాలు నిర్వహించకూడదు. పోలింగ్ కేంద్రాల లోపలికి ఓటర్లు, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు మాత్రమే నిబంధనలకు అనుగుణంగా అనుమతించబడతారు. భద్రతా సిబ్బంది రక్షణ (సెక్యూరిటీ కవర్) కలిగిన వ్యక్తులు పోలింగ్ కేంద్రాల లోపలికి అనుమతించబడరు.

ఉంటుంది.

పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే ఎన్నికల సిబ్బందికి, పోలీసు బందోబస్తు సిబ్బందికి ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

నంద్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా, బాధ్యతాయుతమైన ఓటర్లుగా వ్యవహరిస్తూ, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఇతరులను కూడా ఓటు వేసేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, ప్రజల సహకారంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించండి

మహానంది, పల్లె వెలుగు తనను ఇంటి ఆడబిడ్డగా భావించి ఆదరించాలని, ప్రజల ఆశీస్సులతో

ప్రజాసేవకు అవకాశం కల్పించాలని గాజులపల్లె-2 ఎంపీటీసీ కూటమి అభ్యర్థి పడకండ్ల శ్రీదేవి కోరారు. శనివారం మహానంది మండలంలోని గాజులపల్లె, బసాపురం గ్రామాల్లో కూటమి అభ్యర్థులు గాజులపల్లె-1,2 ఎంపీటీసీ పడకండ్ల శ్రీదేవి, బుద్దా శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి కిలారి లక్ష్మీదేవి లను కమలం, సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కూటమి నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైకిల్, కమలం గుర్తులపై ఓటు వేసి మద్దతు తెలిపి, గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కూటమి పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ ప్రచారం చేపట్టారు.ప్రతి వార్డులోని ఇంటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు బిజెపి రాష్ట్ర సీడ్స్ సెల్ కన్వీనర్ పడకండ్ల నాగేశ్వరరావు, గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర రెడ్డి, లక్ష్మీనారాయణ,రవి స్వామి, మాభు,మహేంద్ర, రవికుమార్, విజయ్ కార్యకర్తలు బ్రహ్మం, బుజ్జి, శేఖర్, ఇర్ఫాన్, హుస్సేన్ భాష, జమాల్,తదితరులు పాల్గొన్నారు.

కైరుప్పలలో రాజమ్మ గెలుపే లక్ష్యంగా ప్రచారం.

ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించండి.
ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సీనియర్, యువ నాయకులు.. సీపీఎం నాయకులు, గ్రామ ప్రజలు.

ఆస్పరి (పల్లె వెలుగు): కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థి బురన దొడ్డి రాజమ్మ విజయమే లక్ష్యంగా ముమ్మర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, సీపీఎం నాయకులతో పాటు గ్రామ ప్రజలు ప్రచారంలో పాల్గొని అభ్యర్థి గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ప్రజలను కలిసి రాజమ్మకు మద్దతు ఇవ్వాలని ఎంపీటీసీ అభ్యర్థి భర్త డాక్టర్ జి కే వీరేష్ కోరారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి బురన దొడ్డి రాజమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభ్యర్థికి మద్దతుగా ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు. ఎన్నికల్లో రాజమ్మ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు.

వైయస్సార్సీపితోనే గ్రామ అభివృద్ధి

మహానంది, పల్లె వెలుగు గ్రామ అభివృద్ధి చెందాలన్న,ప్రజలకు న్యాయం జరగాలన్న ఫ్యాన్ గుర్తుకి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో జడ్పీటీసీ అభ్యర్థులను గెలిపించాలని వైసీపీ నేత, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి కొండా మధుసూదన్ రెడ్డి కోరారు. శనివారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో ప్రతి వార్డులోని ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గాజులపల్లె -1,2 వైఎస్ఆర్సిపి ఎంపీటీసీ అభ్యర్థులు భూపని వెంకటరమణ, కనుమల లక్ష్మీదేవిలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు గెలిపించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి,ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి జరిగిందఅన్నారు.అభివృద్ధి చెందాలన్న,ప్రజలకు న్యాయం జరగాలన్న ఫ్యాన్ గుర్తుకి ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యను హతమార్చిన భర్త

బనగానపల్లె ,అక్టోబర్31, పల్లెవెలుగు పట్టణం లోని అవుకు మెట్ట సమీపంలోని ఆంజనేయస్వామి దగ్గర షేక్ అల్లా బకాష్ అనే వ్యక్తి అనుమానంతో భార్య షేక్ జరీనా బీ(34) ని గొడ్డలితో నరికి చంపినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని అవుకుమెట్ట సమీపంలో షేక్ అల్లాబకాస్ తన మేనమామ కుమారుడు తో భార్య షేక్ జరీనాబి అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో గొడ్డలితో నరికి హత్య చేసినట్లు సిఐ తెలిపారు కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఆవుకు మెట్ట సమీపంలో నివసిస్తున్న షేక్ అల్లాబకాష్,జరీనాబీ దంపతులకు 22 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు అమ్మాయి కి 15 సంవత్సరాలు, అబ్బాయి కి 18 సంవత్సరాలు. అల్లా బకాస్ మేనమామ కొడుకుతో జరీనాబీ అక్రమ సంబంధం కలిగి ఉన్నదని కోపంతో గొడ్డలితో నరికి హత్య చేసి ఇంటికి తాళం వేసి పోలీస్ స్టేషన్లో లొంగిపోయినట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే సీఐ ప్రవీణ్ కుమార్ హత్య జరిగిన ప్రాంతాన్ని వెళ్లి పరిశీలించారు హత్యకు గల కారణాలను చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థి

బనగానపల్లె, అక్టోబర్ 31, పల్లెవెలుగు పట్టణంలోని రవ్వలకొండ ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి కె. శ్రీనివాస కార్తీక్ కర్నూలు--నంద్యాల జిల్లాల ఎస్ జి ఎఫ్ ఐ పోటీలలో కరాటే (కుమిటే) అండర్-17, -70 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ రామలక్ష్మి శనివారం తెలిపారు. నవంబర్ 21 నుంచి 23 వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో జరగే రాష్ట్రస్థాయి పోటీలలో కార్తీక్ పాల్గొననున్నాట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన శ్రీనివాస కార్తీక్ ను పాఠశాల ప్రిన్సిపాల్ సి. హెచ్. రామలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ షేక్ సిరాజున్, జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు, పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.

చల్లా కుటుంబ సభ్యులతో వైస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుళరెడ్డి ఆత్మీయ భేటీ

బనగానపల్లె, అక్టోబర్ 31,పల్లెవెలుగు అవుకు మండలం ఉప్పలపాడు గ్రామంలో చల్లా కుటుంబ సభ్యులతో వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి ఆత్మీయ భేటీ వైఎస్సార్సీపీ నాయకులు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి ని,చల్లా ప్రభాకర్ రెడ్డి ని ఆత్మీయంగా పలకరించి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న కాటసాని ఓబుల్ రెడ్డి . అక్రమ కేసుల నేపథ్యంలో జైలుకు వెళ్లి తిరిగి వచ్చిన చల్లా విక్రాంత్ రెడ్డి ని ప్రత్యేకంగా కలిసి పరామర్శించిన కాటసాని ఓబుల్ రెడ్డి చల్లా విక్రాంత్ రెడ్డి కి అన్నివిధాల అండగా ఉంటా.. అక్రమ కేసులకు పాల్పడుతున్న కూటమి నాయకులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఈ కార్యక్రమం లో పాపిరెడ్డి సుదర్శన్ రెడ్డి, మమ్మద, అఖిల్, ఫిరోజ్, రాజుయాదవ్,నర్సిరెడ్డి, కొట్టాల మోహన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

నిచ్చితార్థం మరియు వివాహ కార్యక్రమాలకు హాజరయిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె, అక్టోబర్ 31,పల్లెవెలుగు బనగానపల్లె నియోజకవర్గం లో నిశ్చితార్థం

మరియు వివాహ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి , ఆవుకు మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి గారు, ఈ కార్యక్రమం లో సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి , కల్వటాల తిమ్మారెడ్డి, సుబ్బుతల్లం,ఇటిక్యాల చంద్ర శేఖర్ రెడ్డి,పార్థ సారధి రెడ్డి, కునుకుంట్ల పురుషోత్తం నాయుడు,కాశీపురం అయ్యపురెడ్డి,సుంకేసుల నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

బనగానపల్లె జడ్పిటిసి సభ్యులుగా బురానుద్దీన్

బనగానపల్లె, అక్టోబర్ 31, పల్లెవెలుగు బనగానపల్లె జడ్పిటిసి సభ్యులుగా షేక్ బురానుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు శనివారం నంద్యాలలో జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో శివశంకర్ చేతుల మీదుగా జడ్పిటిసి సభ్యులుగా బురానుద్దీన్ డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బురానుద్దీన్ మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో బనగానపల్లె జడ్పిటిసి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో బనగానపల్లె మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు

నవంబర్ 8 న స్వాతి వేడుకలు

బనగానపల్లె, అక్టోబర్ 31,పల్లెవెలుగు బనగానపల్లె మండలం, భానుముక్కల గ్రామం

నందు గల, రవలకొండపై, వెలసిన శ్రీ శ్రీ శ్రీ చెంచులక్ష్మి సమేత పావన నరసింహ స్వామి దేవస్థానము నందు, నవంబర్ 8 ఆదివారం స్వాతి వేడుకలు జరుగునని, ఆ దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, నిర్మాణ కర్త, ధర్మకర్త, విశ్వహిందూ పరిషత్ ప్రచారకులు మరియు ప్రధాన అర్చకులు అయినటువంటి బాలిశెట్టి పావన నరసింహమూర్తి విలేకరుల సమావేశంలో తెలియజేశారు. అలాగే, అదే రోజు దేవస్థానం ట్రస్ట్ బోర్డు మీటింగ్ ఉందని ఆయన తెలియజేశారు. ఇందులో తొమ్మిది మంది శాశ్విత సభ్యులు ఉన్నట్టు, వారందరూ కూడా ఆరోజు దేవస్థానం నందు మీటింగ్ జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ దేవస్థానం ప్రత్యేకత! నవ నారసింహులు నవగ్రహాలు కలిపి పుట్టు శిల, పుట్ట, నాగులు, స్వయంభు శివలింగము, కృష్ణుడు మరియు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు అయినటువంటి వారి అమ్మవారి విగ్రహ ము ఉండడం విశేషం. ఎందుకంటే గర్భగుడి లోనికి, పోయేముందు వారి అమ్మగారికి, పూజ చేసిన తర్వాతనే గర్భగుళ్ళకి పోతానని ఆయన విలేకరుల కు తెలియజేశారు. ఆరోజు ఉదయం మంగళ వాయిద్యాలతో, మొదలై స్వామివారికి సుప్రభాతముతో, తులసీదళాలతో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ఆకు పూజ అర్చనలు. జరుగుతాయని ఆయన తెలియజేశారు. కావున ఈ అవకాశాన్ని భక్తులందరూ ఉపయోగించుకొని, అలాగే తమ తమ కోరికలు స్వామివారికి విన్నవించుకొని స్వామివారి ఆశీస్సులు పొందగలరని, ఆయన విలేకరులకు తెలియజేశారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి...ఎంపీ బస్తిపాటి నాగరాజు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఓటు వేయడం ప్రతి పౌరుని బాధ్యత అని, ఓటు వేయకపోతే ప్రశ్నించే హక్కును కోల్పోతారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు..ఆదివారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.. ఎలాంటి ప్రలోభాలకు, భయాలకు లోనవకుండా అందరూ నిర్భయంగా ఓటు వేయాలన్నారు..ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదని, మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి మనకు లభించే గొప్ప అవకాశమని ఎంపీ నాగరాజు తెలిపారు...

రాప్తాడు పాఠశాలలో విద్యార్థినులపై దాడి అత్యంత దుర్మార్గం!

నిందితుడిని కఠినంగా శిక్షించాలి.. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి.
ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్.

ఆదోని (పల్లె వెలుగు): అనంతపురం జిల్లా రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులపై జరిగిన దాడి ఘటన అత్యంత దుర్మార్గమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కర్నూలు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనలో గాయపడిన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, దాడికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గోపికపై హేమంత్ అనే వ్యక్తి రంపం మిషన్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. తోటి విద్యార్థినిపై జరుగుతున్న దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన లక్ష్మిపై కూడా నిందితుడు దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడిందని తెలిపారు.

విద్యార్థినులు తరగతి గదిలో పాఠాలు వింటున్న సమయంలో బయటి వ్యక్తి ప్రవేశించి దాడికి పాల్పడటం అత్యంత అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో విద్యనభ్యసించాల్సిన పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉందని స్పష్టం చేశారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించి బాధ్యత వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గాయపడిన గోపిక, లక్ష్మిలకు మెరుగైన వైద్యం అందించి, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరింది. నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.

పాఠశాలల్లో భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

పాఠశాలలు విద్యార్థులకు భద్రత, భరోసా కల్పించే కేంద్రాలుగా ఉండాలే తప్ప భయాందోళనలకు నిలయాలుగా మారకూడదని శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, పాఠశాలల వద్ద పర్యవేక్షణను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చాలి.

ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.
పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ఓటర్లు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని నడిగడ్డ 6వ వార్డు, సరస్వతీ నగర్ 15వ వార్డు, బొగ్గులైన్ 27వ వార్డు ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, ఇతర అవసరమైన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన నంద్యాల జిల్లా పోలీసులు.

- **జాతీయ ఏక్తా దివస్ వేడుకల సందర్భంగా ఐక్యతా పరుగు నిర్వహించిన నంద్యాల జిల్లా పోలీసులు.**
- **దేశ సమగ్రత, ఐక్యతకు కృషి చేసిన పటేల్ జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి.**

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయం నందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోలీసు అమరవీరుల సంస్మరణ

వారోత్సవాల సంధర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జాతీయ సమైక్యతను చాటుతూ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయం నుండి బొమ్మలసత్రం మీదుగా క్రాంతి నగర్ చేరుకొని తిరిగి జిల్లా పోలీస్ కార్యాలయానికి ఐక్యతా పరుగు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 31 న జాతీయ ఐక్యతా దినోత్సవం లేదా రాష్ట్రీయ ఏక్తా దివస్ జరుపుకుంటారన్నారు. సువిశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం మనకు ఆదర్శప్రాయం. బ్రిటీషర్లు భారత్‌ను విడిచి వెళ్లాక... దేశ రక్షణ, సమగ్రత కోసం, భారతదేశాన్ని ఐక్యంగా ఉంచడంలో ఆయన చేసిన కృషి గురించి అవగాహన కల్పించడమే ఈ వేడుక యొక్క ప్రధాన లక్ష్యమన్నారు.

ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు, సురేష్ , ఆర్.ఎస్.ఐ హర్షవర్ధన్ రెడ్డి, డి పి ఓ అధికారులు మరియు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ కి ఓటు వేస్తే వృధా...ఎంపీ బస్తిపాటి నాగరాజు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో గత వైసీపీ ఐదేళ్ళ

పాలనలో కనీసం గుంతలు పడ్డ రోడ్లకు ప్యాచ్ వర్కులు కూడా చేయించలేకపోయిందని ఎంపీ బస్తిపాటి నాగరాజు విమర్శించారు.. పెద్ద కడబూరు మండలంలోని తారాపురం, రంగాపురం, చిన్న కడబూరు, మేకడోన గ్రామాల్లో మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి తో కలిసి ఆయన ఎంపీటీసీ, జెడ్పిటీసీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు..ఈ సందర్భంగా ఎంపీ నాగరాజుమాట్లాడుతూ గొడ్డలి పార్టీ పంచాయితీ నిధులను మళ్ళించి గ్రామాల అభివృద్ధి ని పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత పల్లెలకు ప్రత్యేక నిధులను కేటాయిస్తూ అభివృద్ధి చేస్తుందన్నారు..ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ కి ఓటు వేసినా వృధా అవుతుందని, పొరపాటున వైసీపీ అభ్యర్థులు గెలిచినా తమ ప్రభుత్వం అధికారంలో లేదని గ్రామాల అభివృద్ధి పట్టించుకోరన్నారు...కావున అధికారంలో ఉండి, అభివృద్ధి చేస్తున్న కూటమిని ఎన్నికల్లో గెలిపించాలని ఎంపీ కోరారు.. ఈ కార్యక్రమంలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, మండల మాజీ ఎం.పీ.పీ శశిరేఖ, జెడ్పిటిసీ అభ్యర్థి మల్లికార్జున, ఎంపీటీసీ అభ్యర్థులు, స్థానిక టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు...

ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. . సిపిఐ.

● కక్కుర్తి రాజకీయ పార్టీలకు స్వస్తి పలుకుదాం. ● కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందాం. ● ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం. ● రుద్రవరంలో సిపిఐ ప్రచార హోరు.

రుద్రవరం. పల్లె వెలుగు : ప్రజలకు కల్లబొల్లి మాటలు చెబుతూ అందలమెక్కుతూ చివరకు ప్రజలకు ప్రజాస్వామ్యంలో భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును హరించుకునేందుకు కక్కుర్తి పార్టీలు నేడు రాష్ట్రంలో తయారయ్యాయని ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి వారి ఓటు హక్కును కాపాడుకొని త్వరలో జరగబోయే జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అభ్యర్థులుగా బరిలో నిలిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మురళీలు అన్నారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలలో భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలంటూ శనివారం మండల కేంద్రం రుద్రవరం తో పాటు మండలంలోని కొండ మాయపల్లి, వెలగలపల్లి,

మందులూరు, చందలూరు, ఎర్రగుడిదిన్నె, పేరూరు, మాచినేనిపల్లి ,నాగిరెడ్డిపల్లి, ఆర్ నాగులవరం, తిప్పారెడ్డిపల్లి ,టి లింగం దిన్నె ,తువ్వపల్లి గ్రామాలలో జడ్పిటిసి అభ్యర్థి కొమ్ము భాస్కర్, ఎంపీటీసీ అభ్యర్థి మంగలి పాములేటిలను గెలిపించాలంటూ ప్రచారాన్ని నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ గుర్తులైన కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి , వేయించి తమ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలంటూ అభ్యర్థించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల వైఫల్యాలను ఎండగడుతూ విప్లవ గీతాలతో ప్రజలను ఉర్రూతలూగిస్తూ ప్రచార పర్వాన్ని నిర్వహించారు. రుద్రవరం లోని ప్రతి గడపకు తిరిగి ప్రతి ఒక్కరిని కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలంటూ అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పిటిసి అభ్యర్థి కొమ్ము భాస్కర్, ఎంపీటీసీ అభ్యర్థి మంగలి పాములేటి మండల కార్యదర్శి బాల నరసింహుడు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, పలువురు ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

మునిసిపల్ ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు: ఎస్పీ విక్రాంత్ పాటిల్

-నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

-పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. శనివారం గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని అథీనా స్కూల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల బందోబస్తుకు హాజరైన పోలీసు అధికారులు, సాయుధ బలగాలు, సిబ్బందికి ఆయన పలు కీలక సూచనలు, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. సమస్యలు తలెత్తకుండా సమస్యాత్మక, సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సీసీ కెమెరాలు, అవసరమైన చోట్ల వీడియోగ్రాఫర్ల ద్వారా పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా

కేంద్రాల్లోనే రాత్రి బస చేసి, ఆదివారం ఉదయం నుంచే పూర్తి అప్రమత్తతతో విధుల్లో నిమగ్నం కావాలని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలు ఎటువంటి భయభ్రాంతులకు గురికాకుండా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ హనుమంతు, అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, డీఎస్పీలు రాఘవేంద్ర, దుర్గ ప్రసాద్, పలువురు సీఐలు, ఎస్సైలు, సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఎంపిటిసి. జడ్పిటిసి.హోరెత్తుతున్న టీడీపీ ఎన్నికల ప్రచారం.

సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థుల విజ్ఞప్తి..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక గడివేముల మండలం పెసర వాయి గ్రామంలో టీడీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది.మండల జడ్పీటీసీ అభ్యర్థి బండి లావణ్య లక్ష్మి పెసరవాయి ఎంపీటీసీ కురువ మహాలక్ష్మి పాటు మండల ఎంపీపీ అభ్యర్థి అయిన అనసూయమ్మ గ్రామ టిడిపి నాయకురాలు ఒడ్డు లక్ష్మీదేవి ఒడ్డు ప్రశాంతి విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.ప్రతి వీధి,ప్రతి ఇంటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీటీసీ అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. గతంలో రూ.2,000గా ఉన్న వృద్ధాప్య పింఛన్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4,000కు పెంచిందని, వికలాంగులకు రూ.6,000, కిడ్నీ, లివర్ తదితర తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి రూ.10,000 పింఛన్ అందిస్తోందని తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీన

లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తూ వృద్ధులకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి నాయకత్వంలో గడివేముల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు గడివేములకు ట్రాఫిక్ సమస్య వలన అంతరాయం ఏర్పాటుతో హైవే రహదారి శాంక్షన్ చేసిన ఘనత మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిది,ప్రజలకు ఇంటింటా ప్రచారంలో తెలియజేశారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని అభ్యర్థులు తెలిపారు.మండల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అనుభవజ్ఞులైన నాయకులతో పాటు మహిళా అభ్యర్థులను కూడా ఆదరించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలను కోరుతున్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో తుమ్ బాలేశ్వర రెడ్డి టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో

వైభవంగా అయ్యప్ప స్వామి పడి పూజ

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నగరంలోని శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలోని దత్త కళాక్షేత్రంలో అయ్యప్ప స్వామి పడి పూజా మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, నేత్రపర్వంగా జరిగింది. హైదరాబాద్ కర్మన్‌ఘాట్ హరిహర క్షేత్రం నుండి శబరిమలకు చేపట్టిన 13వ మహా పాదయాత్ర కర్నూలు చేరుకున్న సందర్భంగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకను భక్తులు బాలకృష్ణ రెడ్డి, మంజుల దంపతులు, వారి కుమారుడు హర్షవర్ధన్ రెడ్డిలతో పాటు ఆలయ ట్రస్టీ టి. శివరామకృష్ణ సహకారంతో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ పాదయాత్రకు గురుస్వాములు సందీప్ రెడ్డి, రమేష్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి నేతృత్వం వహిస్తూ భక్తులకు మార్గదర్శనం చేస్తున్నారు. పడి పూజలో భాగంగా శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, దీపారాధనలు నిర్వహించారు. శరణుఘోషతో దత్త కళాక్షేత్ర ప్రాంగణం మార్మోగింది. ఈ పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు, స్థానికులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజా అనంతరం భక్తులకు, అయ్యప్ప స్వాములకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ (భిక్ష) చేపట్టారు. శబరిమల యాత్ర నిర్విఘ్నంగా, క్షేమంగా సాగాలని ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పోస్టల్ బ్యాలెట్(ఓటు హక్కు) ఉపయోగించిన 35మంది ఉద్యోగస్తులు..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక స్థానిక మండల పరిషత్ నందు ఐదవ తేదీ జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల నిమిత్తము ఏర్పాటు చేయబడిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రమునందు మండలములో ప్రభుత్వ ఉద్యోగులు 35 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని మండల ఎంపీడీవో వాసుదేవ గుప్తా తెలియజేయబడినది. ఈ కార్యక్రమములో ప్రిసైడింగ్ ఆఫీసర్గా మండలములోని ఏపీవో ఈ వెంకటరమణ మరియు వారి సిబ్బంది బాధ్యత వహిస్తూ పోలింగ్ ప్రక్రియను పూర్తి చేశారు .

రాప్తాడు విద్యార్థినిపై దాడి అమానుషం.

☛నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి.

☛బాధిత విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి.

☛డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ డిమాండ్.

ఆదోని (పల్లె వెలుగు): అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై రంపంతో దాడి చేసిన ఘటనను డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (డీఎస్ఎఫ్) తీవ్రంగా ఖండించింది. విద్యార్థినిపై దాడికి పాల్పడిన నిందితుడు హేమంత్‌ను తక్షణమే అరెస్టు చేసి, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులపై దాడులు జరగడం ఆందోళనకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడిలో గాయపడిన విద్యార్థిని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆమె కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఇలాంటి ఘటనలకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జనసేన అభ్యర్థులను గెలిపించాలని విస్తృత ప్రచారం..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల జడ్పిటిసి అభ్యర్థి యు.దివ్య వాణి, ఎంపిటిసి అభ్యర్థి సిరిపిరెడ్డి పార్వతమ్మను జనసేన పార్టీ తరఫున జడ్పిటిసి అభ్యర్థులు గెలిపించాలని ఈరోజు దుర్వేసి కోటమద్ది, తిరుపాడు, గ్రామాలలో జనసేన అభ్యర్థులు అయిన ధరణి చంద్రమోహన్ నాగేశ్వర్ రెడ్డి పుల్లారెడ్డి మరియు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ జనసేన అభ్యర్థులను గెలిపించాలని కరపత్రాలు పంచుతూ పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి ఉన్నాయని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచుతూ మీ పవిత్రమైన ఓటు గ్లాస్ గుర్తుపై వేసి వేయించలని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు అభిమానులు పాల్గొని భారీ ఎత్తున ప్రచారం చేయడం జరిగింది..

సైకిల్ గుర్తుపై ఓటు వేసి నన్ను గెలిపించండి

-అభివృద్ధి చేసి చూపిస్తా... చిట్టూరి నాగమణి కల్కి మూర్తి

తాళ్లరేవు, అక్టోబర్ 31పల్లె వెలుగు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం నీలపల్లి గ్రామంలో కూటమి బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థి చిట్టూరి నాగమణి కల్కి మూర్తి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని మెయిన్ రోడ్డు, రేవువారిపేట, ఫిషర్మెన్ కాలనీ, మోకావారిపేట ప్రాంతాలలో ఆమె ముమ్మరంగా పర్యటించి, కరపత్రాలు పంచుతూ ఓటర్లను ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా చిట్టూరి నాగమణి కల్కి మూర్తి మాట్లాడుతూ, రాష్ట్రంతో పాటు గ్రామం కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే సైకిల్ గుర్తుపై ఓటు వేసి తెలుగుదేశం పార్టీని, కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వ సారథ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని, ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆమె తెలిపారు. తనను గెలిపిస్తే నీలపల్లి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు వస్కా రెడ్డి, బూత్ యూనిట్ ఇన్‌చార్జి గంటా గోపి, కాల సత్తిబాబు, పిల్లి సత్తిబాబు, గుబ్బల రమణ, రాయుడు, చిక్కాల సుబ్బారావు, రాయుడు శివ ప్రసాద్, ఓలేటి నరసింహ మూర్తి, రేవువారిపేట యూత్ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి : ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

సీతానగరం, అక్టోబర్ 31పల్లె వెలుగు చిన్నకొండెపూడి గ్రామంలో శనివారం స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో కలిసి చిన్నకొండెపూడి గ్రామంలో గడప గడపకూ వెళ్లి ప్రజలను నేరుగా కలిశారు. స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ, కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఓట్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, చిన్నకొండెపూడి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పన, ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందాలంటే స్థానిక సంస్థల్లో కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల మండల నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసీపీ అభ్యర్థులను గెలిపించండి : కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్, అక్టోబర్ 31పల్లె వెలుగు చేతకాని, అసమర్థ కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే స్థానిక సంస్థల ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ పరిధిలోని కొవ్వూరులో ఎంపీటీసీ-1, ఎంపీటీసీ-2 అభ్యర్థులైన దేవిశెట్టి శారదాదేవి, సాధనాల సత్తిబాబులతో కలిసి ఆయన శనివారం ఇంటింటికి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పేరుతో ప్రజలను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సరిగ్గా అమలు చేయలేదని, ఈ ప్రభుత్వ పాలనలో పేదవాళ్లు బతికే పరిస్థితి లేకుండా పోయిందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనంతరం ఎంపీటీసీ అభ్యర్థులు దేవిశెట్టి శారదాదేవి, సాధనాల సత్తిబాబు మాట్లాడుతూ, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలోనే కొవ్వూరు గ్రామంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు కనీసం తాగునీటికి కూడా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో తమకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే గ్రామాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని ఓటర్లకు హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు

గడప గడపకూ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ప్రచారం

-ఇనుగంటివారిపేటలో జోరుగా సాగిన జడ్పీటీసీ అభ్యర్థి బత్తుల వెంకటలక్ష్మి పర్యటన

సీతానగరం, అక్టోబర్ 31 పల్లె వెలుగు ఇనుగంటివారిపేట గ్రామంలో జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ కూటమి జడ్పీటీసీ అభ్యర్థి బత్తుల వెంకటలక్ష్మి విస్తృతంగా పర్యటించారు. రాబోయే ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రజలను నేరుగా కలిశారు. ఈ సందర్భంగా గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి, తమను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ, కూటమి ఆధ్వర్యంలో చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. మండల అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని బత్తుల వెంకటలక్ష్మికి తమ సంపూర్ణ పూర్తి మద్దతు తెలిపారు

మండగిరి-1లో కూటమి అభ్యర్థుల జోరుగా ప్రచారం

☛ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. గెలిపిస్తే అభివృద్ధికి కృషి చేస్తాం.

☛ఎంపీటీసీ అభ్యర్థి వెల్లాల రవికిరణ్.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలం-1 పరిధిలోని మండగిరి-1లో కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కూటమి తరఫున ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెల్లాల రవికిరణ్, జనసేన పార్టీ తరఫున జెడ్పీటీసీ అభ్యర్థిగా బరిలో ఉన్న తాహెర్ వలితో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి తమకు మద్దతు తెలిపి గెలిపించాలని అభ్యర్థించారు.

తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం

ప్రచారం అనంతరం ఎంపీటీసీ అభ్యర్థి వెల్లాల రవికిరణ్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఆయా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గత 20 సంవత్సరాలుగా మండగిరి పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధిపత్యంలో కొనసాగుతోందని విమర్శించారు. మండగిరి-2కు

చెందిన నాయకులు మండగిరి-1లో జోక్యం చేసుకుంటూ పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితిని మార్చి, మండగిరి-1 అభివృద్ధిని స్థానికులే ముందుండి సాధించాలనే సంకల్పంతో తాను ఎన్నికల బరిలో నిలిచినట్లు వెల్లడించారు.

కూటమి ప్రభుత్వ సహకారంతో సమస్యల పరిష్కారం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రవికిరణ్ తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, జనసేన పార్టీ ఇన్‌చార్జి మల్లప్పన్న అండదండలు తనకు ఉన్నాయని పేర్కొన్నారు. వారి సహకారంతో మండగిరి-1 అభివృద్ధికి కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ మురళి, బాబూరావు, రేవన్, బీజేపీ నాయకులు మధుసూదన శర్మ, లలితమ్మ, మహేష్ నాయక్, నాగేష్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫెయిత్ స్కూల్ విద్యార్థుల విద్యా విహారయాత్ర

-వైద్యవృత్తి ప్రాముఖ్యత, ఆరోగ్య పరిరక్షణ, సమాజ సేవపై అవగాహన

రాజమహేంద్రవరం, అక్టోబర్ 31 పల్లె వెలుగు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సేవాభావం పెంపొందించి జీవిత లక్ష్యాలను నిర్దేశించుకునేలా ప్రేరణ కల్పించేందుకు రాజమహేంద్రవరం విద్యానగర్ లోని ఫెయిత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులు 52 మంది, ఉపాధ్యాయులు శనివారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలను విద్యా విహారయాత్రలో భాగంగా సందర్శించారు. పాఠశాల కరస్పాండెంట్లు జీ.ఎస్ మోసెస్, బీ. కమల శ్రేయేయిన్, జీ. బ్రెయిన్ మోసెస్ మార్గదర్శకత్వంలో ఈ యాత్ర జరిగింది. తొలుత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్ రాజును వారు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్న వయసులోనే విద్యా సంస్థలను సందర్శించడం ఎంతో ప్రాధాన్యత కలిగిన విషయమన్నారు. ఇవి ఆలోచనా పరిధిని విస్తృతం చేసి, ఉన్నత ఆశయాలను ఏర్పరచుకోవడానికి దోహదపడతాయని తెలిపారు. పేదలకు సేవ చేయాలనే సంకల్పం ఉన్నవారు వైద్యవృత్తిని ఎంచుకోవచ్చని, పట్టుదలతో చదివి వైద్య విద్యను అభ్యసించాలని సూచించారు. భవిష్యత్తులో ఈ కళాశాలలోనే విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వి.వి దుర్గాప్రసాద్ విద్యార్థులతో మాట్లాడుతూ వైద్యవృత్తి ప్రాముఖ్యత, ఆరోగ్య పరిరక్షణ, సమాజ సేవపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) పై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రత్యక్ష ప్రదర్శనతో చేతుల మీదుగా శిక్షణ

అందించారు. విద్యార్థులు వైద్య కళాశాలలోని మ్యూజియం, స్కిల్ ల్యాబ్ తో పాటు వివిధ విభాగాలను సందర్శించి వైద్య పరికరాలు, అత్యవసర వైద్య విధానాల గురించి తెలుసుకున్నారు. చేతులు శుభ్రం చేసుకునే విధానం ప్రదర్శించి చూపించారు. వ్యాక్సినేషన్ పై కూడా అవగాహన కలిగించారు.

ఈ విహారయాత్ర విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించి, వైద్యవిద్య పట్ల ఆసక్తిని, ఉన్నత లక్ష్యాలను సాధించాలనే స్ఫూర్తిని కలిగించిందని యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి. శ్రీనివాస్ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సురేంద్ర, డాక్టర్ వి. సూర్యారావు, డాక్టర్ దీప్తి, డాక్టర్ ఉదయ్ కుమార్, సామాజిక శాస్త్రోపన్యాసకులు ప్రసన్న, మూర్తి, శాస్త్రి, శ్రీనివాస్, విజయ్ మరియు ఫెయిత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు టి. జానకి, పి. కావ్య, ఆర్. పుష్ప, టి. రోజా, ఎం. హర్షిత, ఏ. అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు

ఎందరికో స్ఫూర్తి నింపుతున్న నిత్య అన్నదాన కార్యక్రమాలు

కొయ్యలగూడెం, అక్టోబర్ 31 పల్లె వెలుగద స్థానిక ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి

అన్నదాన కార్యక్రమాన్ని శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, దిగ్విజయంగా నిర్వహించారు. మండల దీక్షల నేపథ్యంలో అయ్యప్ప స్వాములకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. గుర్రాన సురేష్, పద్మజ దంపతులు, హనీ శ్రీ వాత్సవ్, యాన్సిక కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ఈ బృహత్తర అన్నదాన కార్యక్రమాన్ని భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. ఈ పవిత్రమైన అన్నదాన కార్యక్రమంలో 41 రోజుల మండల దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములతో పాటు భారీ సంఖ్యలో భక్తులు, స్థానికులు విచ్చేసి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. దాతలు ముందుకొచ్చి ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆర్థిక తోడ్పాటు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నదాన శిబిరంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. ఉదయం నుంచి జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఈ అన్నదాన ప్రక్రియ మొదలైంది. ఈ పవిత్ర కార్యక్రమానికి సహకరించిన దాతల కుటుంబ సభ్యులపై ఆ అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ నిండుగా ఉండాలని నిర్వాహకులు, తోటి స్వాములు ఆకాంక్షించారు. భారీగా తరలివచ్చిన భక్తులతో, స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో గుడి ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని మారుమోగింది

రంపచోడవరంలో, జాతీయ సమైక్యత పరుగు

☛రాష్ట్రీయ ఏక్తా దివస్, పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా రన్ ఫర్ యూనిటీ

రంపచోడవరం, అక్టోబర్ 31 పల్లె వెలుగు రాష్ట్రీయ ఏక్తా దివస్, సర్దార్ పటేల్ జయంతి, పోలీస్

అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా పోలవరం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం రంపచోడవరంలో జాతీయ సమైక్యత పరుగు (రన్ ఫర్ యూనిటీ) నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి (ఐపీఎస్) ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ (ఐఏఎస్), ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రత, అంతర్గత భద్రత పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సమైక్యతా భావాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. దేశ సమగ్రత కోసం పటేల్ చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశ సమైక్యతను కాపాడటం పౌరుల బాధ్యత అని, కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పృధ్విరాజ్, ఓఎస్డీ అడ్మిన్ జావలి ఆల్ఫోన్స్, డీఎస్పీ అస్రబ్ అలీ, చింతూరు డీఎస్పీ ఉదయపావని, ఏఆర్ డీఎస్పీ సీతారాం, ఎస్బీ సీఐ భాను ప్రసాద్, ఏఆర్ ఆర్ఐ వరప్రసాద్ బాబు, రంపచోడవరం సీఐ నరేంద్ర ప్రసాద్, ఎస్ఐ రమేష్, ఈగల్ టీం, ఏఎన్ఎస్ టీం సభ్యులు, జూనియర్ కళాశాల విద్యార్థులు, యువత, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

తామరాడలో వైసీపీకి షాక్.. టీడీపీలో చేరిన పలువురు నాయకులు

కిర్లంపూడి, అక్టోబర్ 31 పల్లె వెలుగు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం తామరాడ గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ శనివారం గ్రామంలో విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలోకి వచ్చిన వారందరికీ ఎమ్మెల్యే టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం టీడీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై, జ్యోతుల నెహ్రూ నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి తమ వంతు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కిర్లంపూడి మండల టీడీపీ అధ్యక్షులు వీరంరెడ్డి కాశిబాబు, నీలం శ్రీనివాస్, అనుకూరి శ్రీకాంత్, తోట రవి, అల్లు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు

మందేశ్వర స్వామికి ఘనంగా తైలాభిషేకాలు

మందపల్లి, అక్టోబర్ 31 పల్లె వెలుగు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలోని మందేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారికి భక్తులు నిర్వహించిన వివిధ పూజల ద్వారా మొత్తం రూ.1,70,485 ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. భక్తులు జరిపించిన ప్రత్యక్ష పూజల ద్వారా రూ.72,040, పరోక్ష ఆన్లైన్ పూజల ద్వారా రూ.87,600, అన్నప్రసాదం విరాళాల ద్వారా రూ.10,845 ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రత్యక్ష పూజల ఆదాయం వివరాలను ఆయన వివరిస్తూ పది మంది భక్తులు ముఖమండపం తైలాభిషేకం చేయించడం ద్వారా రూ.7,000, 127 మంది ఏకాదశ రుద్ర తైలాభిషేకం చేయించడం ద్వారా రూ.31,750 ఆదాయం సమకూరిందని తెలిపారు. అలాగే 130 మంది మహాన్యాస పూర్వక తైలాభిషేకం ద్వారా రూ.22,750, 118 మంది తైలం సమర్పించి దర్శనం చేసుకోవడం ద్వారా రూ.9,440, ఆరుగురు భక్తులు తిలదానం ద్వారా రూ.300, ఒకరు స్వయం హోమం ద్వారా రూ.800 చొప్పున చెల్లించినట్లు దారపురెడ్డి సురేష్ బాబు వివరించారు

తుఫాను బాధితులకు అండగా..

యానాం, అక్టోబర్ 31 పల్లె వెలుగు ఆర్నాబ్ తుఫాను సృష్టించిన బీభత్సం నేపథ్యంలో యానాం

ప్రాంత బాధితులను పరామర్శించడానికి పుదుచ్చేరి బీజేపీ అధ్యక్షుడు వీపీ రామలింగం శనివారం పర్యటించారు. ముందుగా తీవ్ర ముంపునకు గురైన సావిత్రినగర్‌లో ఆయన పర్యటించి, ఉప్పెన నీటిలో ఇళ్లు మునిగిపోయి నష్టపోయిన వారికి అండగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కష్టకాలంలో బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారం అన్ని ప్రాంతాల బాధితులకు ఆయన స్వయంగా సరుకులు అందించాల్సి ఉండగా, సమయాభావం, షెడ్యూల్ ఆలస్యం కావడంతో కేవలం ఒక ప్రాంతానికే ఆయన పర్యటన పరిమితమైంది. అయితే, బీజేపీ మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో ముందుగా గుర్తించిన మిగిలిన పలు గ్రామాల బాధితులకు కూడా త్వరలోనే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని యానాం భారతీయ జనతా పార్టీ నాయకులు స్పష్టం చేశారు

ఇస్రో బృందానికి శ్రీసిటీ ఎండీ అభినందనలు

(శ్రీసిటీ, అక్టోబరు 31, శనివారం :పల్లె వెలుగు జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు. ఈ ప్రయోగంతో ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టినందుకు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్, షార్ డైరెక్టర్ ఎస్.ముత్తుచెళియన్, ఇతర షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయాన్ని ప్రశంసిస్తూ, కేవలం 56 రోజుల వ్యవధిలోనే వరుసగా రెండు జీఎస్ఎల్వీ ప్రయోగాలను చేపట్టి ఇస్రో అరుదైన రికార్డు సృష్టించిందని డాక్టర్ సన్నారెడ్డి పేర్కొన్నారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో అత్యంత కచ్చితత్వంతో ప్రవేశపెట్టడంతో పాటు, ప్రయోగానికి సంబంధించిన అన్ని కీలక పనితీరు ప్రమాణాలను విజయవంతంగా సాధించడం ఇస్రో సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని కొనియాడారు. ఈ ప్రయోగం భారతదేశ నావిగేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఐఆర్ఎన్ఎస్ఎస్ నిరంతర సేవల కొనసాగింపునకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

వైసీపీ పార్టీకి వరుస షాకులు, టీడీపీలోకి భారీ చేరికలు

జగ్గంపేట, అక్టోబర్ 31 పల్లె వెలుగు స్థానిక సంస్థల

ఎన్నికల నేపథ్యంలో జగ్గంపేట నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఇందులో భాగంగా జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని ఎమ్మెల్యే స్వగృహంలో శనివారం తెలుగుదేశం పార్టీలోకి భారీ చేరికలు జరిగాయి. జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామిశెట్టి చంద్రరావు, యల్లాపు దొరబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో వరుపుల వీరబాబు, వరుపుల నాగరాజు, వరుపుల శేషారావు, వరుపుల సుబ్రహ్మణ్యం, వరుపుల రాంబాబు, వరుపుల రాజు, వరుపుల కొండలరావు, కర్ణాకుల సత్తిబాబు, నాగిరెడ్డి సత్తిబాబు, ఆకుల వెంకటేష్, ద్వారబంధం రాజు, అల్లాడ పాపారావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ నాయకత్వంలో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని వారు స్పష్టం చేశారు. పార్టీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, తగిన ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. అందరూ సమన్వయంతో పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి బస్వ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు

టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ, వైసీపీలో చేరిన గర్లంక శ్రీనివాస్

సీతానగరం, అక్టోబర్ 31 పల్లె వెలుగు రాపాక పేదలను

గ్రామంలో తెలుగుదేశం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఏళ్ల తరబడి టీడీపీకి అండగా నిలిచిన కీలక నేత గర్లంక శ్రీనివాస్ (అయ్యప్ప) మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరారు. గత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఆయనతో పాటు మరో వంద మంది పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా గర్లంక శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. నిత్యావసర ధరలు పెంచి ప్రభుత్వం పీల్చుకు తింటోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో సీతానగరం మండలంలో వైఎస్సార్సీపీ విజయం ఖాయమన్నారు. ఎంపీటీసీ అభ్యర్థి సబ్బితి సుమలత, జెడ్పీటీసీ అభ్యర్థి కరుటూరి హరిబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ సీతానగరం మండలంలో వైద్య సేవలు కుంటుపడ్డాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షల పరికరాలున్నా విద్యుత్తు సదుపాయం లేకపోవడం దారుణమన్నారు. ముప్పై పడకల ఆసుపత్రిని కనుమరుగు చేసి ప్రజలను మోసం చేశారని ఆయన ధ్వజమెత్తారు. పేదవాడికి అండగా నిలిచేది వైఎస్సార్సీపీ మాత్రమేనని, గత ప్రభుత్వ అభివృద్ధి పనులే నేటికీ కనిపిస్తున్నాయని తెలిపారు. సకాలంలో యూరియా, సాగునీరు అందక రైతులు పంటలు నష్టపోయి కన్నీరు పెడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్థలాలు చూపి, ఇళ్లు నిర్మించడం వైఎస్సార్సీపీకే సాధ్యమన్నారు. వాలంటీర్ల ద్వారా గతంలో పథకాలను ప్రజలు స్వేచ్ఛగా అందుకున్నారని గుర్తుచేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పద్దెనిమిది ఏళ్లు నిండిన మహిళలకు ఆర్థిక సహాయం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని రాజా విమర్శించారు. గ్యాస్ సిలిండర్ డబ్బులు కూడా ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. ఎలాంటి పథకాలు లేకుండా పంట నష్టాలు ఇవ్వకుండా రైతులను మోసం చేశారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో జెడ్పీటీసీ అభ్యర్థి కరుటూరి హరిబాబు, రాపాక ఎంపీటీసీ అభ్యర్థి సబ్బితి సుమలత, ఎంపీపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు ఉప్పులూరి సత్యనారాయణ, జెడ్పీటీసీ అభ్యర్థి కరుటూరి హరిబాబు, పెందుర్తి దేవదాసు, పిచ్చుకుల విజయ్, గంటా శ్రీను, కోంద్రపు ముత్యాలు, రావూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించండి

పార్టీ జిల్లా అధ్యక్షులు, పట్నాల విజయకుమార్

రాజమండ్రి, అక్టోబర్ 31 పల్లె వెలుగు ప్రజలకు సేవ

చేయాలనే ఏకైక లక్ష్యంతో తూర్పు గోదావరి జిల్లాలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తరఫున 22 మంది అభ్యర్థులను బరిలోకి దింపినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ వెల్లడించారు. స్థానిక రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎస్పీ అభ్యర్థులను ఆయన పరిచయం చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ, అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ సరైన అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ధనబలం, అధికార బలం లేకపోయినా తమ అభ్యర్థులు నామినేషన్లు వేశారని స్పష్టం చేశారు. పలు ప్రాంతాల్లో ఇతర పార్టీల అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా దాడులు, ప్రలోభాలు, దౌర్జన్యాలకు గురిచేయడంతో పాటు పదవులకు వేలం పాటలు నిర్వహించడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరికీ సమానంగా కల్పించిన విలువైన ఓటు హక్కును వృథా చేయకుండా, సరైన నాయకులను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ తదితర పార్టీలను తట్టుకుని ఎన్నికల్లో నిలబడటం సామాన్యమైన విషయం కాదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కౌన్సిలర్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం బీఎస్పీ రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌చార్జి ఇసకపట్ల రాంబాబు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 1200 ఉండే బియ్యం బస్తా ధర 2300 కు చేరిందని, పంచదార, నూనె తదితర వస్తువుల ధరలు 50 శాతానికి పైగా పెరిగాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలో ఉంటే ఒక మాట, లేకపోతే మరో మాట మాట్లాడతారని విమర్శించారు. ఆయన తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై ధరలను నియంత్రించడం లేదని ఆరోపించారు. నిత్యావసరాల ధరల మోతతో సామాన్యుడు బతికే పరిస్థితి లేదన్నారు.

ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా, నియోజకవర్గాల నాయకులు కొండపల్లి సూరిబాబు, కె. అబ్బులు, కొంకి రమేష్, కొత్తపల్లి శేఖర్, మోర్త పవన్, కె. మోహన్, అనపర్తి శ్రీను, కోరుకొండ, సీతానగరం జెడ్పీటీసీ అభ్యర్థులు కన్నాబత్తుల హైమావతి, గంగిడేసి వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు

వాడపల్లిలో అత్యంత వైభవంగా మూడో రోజు బ్రహ్మోత్సవాలు

హనుమద్వాహనంపై కోదండరాముని దర్శనం

వాడపల్లి, అక్టోబర్ 31 పల్లె వెలుగుకోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి దేవేరుల సమేత వేంకటేశ్వర స్వామి పద్నాలుగవ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన శనివారం ఆలయంలో వైదిక కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల నలభై ఐదు నిమిషాలకు సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సప్తకలశారాధన, అభిషేకం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, మహాపుష్పయాగం తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. పూజా కార్యక్రమాల అనంతరం వేంకటేశ్వర స్వామికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఐదు గంటల ముప్పై నిమిషాలకు స్వస్తి వాచనం, ప్రధాన హోమాలు, సహస్ర దీపాలంకరణ సేవ, దిగ్దేవతా బలిహరణ, విశేషార్చన తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం రాత్రి ఏడు గంటల ముప్పై నిమిషాలకు కోదండరామ అలంకరణలో వేంకటేశ్వర స్వామి వారు హనుమద్వాహనంపై కొలువుదీరి భక్తులకు కనువిందు చేశారు. విశేషమైన ఈ హనుమద్వాహన సేవను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కన్నుల పండువగా జరిగిన ఈ వాహన సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు చేసిన గోవింద నామస్మరణలతో వాడపల్లి ఆలయ ప్రాంగణం మార్మోగింది

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com